సాక్షి నిర్మల్
బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



సెలవుల్లో నేర్చుకుందాం..

పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయి. విద్యార్థులు హాలీడేస్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా ఇప్పటికే సమ్మర్ శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేశాయి. 8లో▸

ఉచిత అథ్లెటిక్స్ కోచింగ్

నిర్మల్ రూరల్: వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు ఉచితంగా అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, సామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్‌లో మే 1 నుంచి కోచింగ్ ఇస్తామని పేర్కొన్నారు. పీఈటీ గిరిప్రసాద్ కోచ్‌గా వ్యవహరిస్తాడని, విద్యార్థులు ఈనెల 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8501054234 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.4/23.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత తగ్గుతుంది. మధ్యాహ్నం తర్వాత చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అటవీ స్థలంపై స్టేటస్‌కో

నిర్మల్: సారంగపూర్ మండలం చించోలి(బి) శివారు అటవీ స్థలంలో నిర్మించిన ఈద్గాపై హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన న్యాయవాది, బీజేపీ నేత అంజుకుమార్‌రెడ్డి మంగళవారం పార్టీ కార్యాలయంలో ఈవిషయం తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం కేటాయించిన అటవీ స్థలంలో ఈద్గా నిర్మాణం చేపట్టారంటూ ఈనెల 18న వేసిన పిటిషన్‌పై కోర్టు తీర్పునిచ్చిందన్నారు. సంబంధిత స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, యథాస్థితిని కొనసాగించాలని ఆదేశించిందని తెలిపారు. తదుపరి విచారణను జూన్‌కు వాయిదా వేసిందని చెప్పారు. ఇది బీజేపీ విజయమని, మైనార్టీలను మోసగించేలా అటవీస్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు.

'ఓపెన్' పరీక్షలకు 138 మంది గైర్హాజర్

నిర్మల్ రూరల్: జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు మొదటి రోజు 138 మంది గైర్హాజర్ అయినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ విద్యార్థుల కోసం మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతిలో మొత్తం 572 మంది విద్యార్థులకు 500 మంది విద్యార్థులు, ఇంటర్‌లో మొత్తం 420 మంది విద్యార్థులకు 354 మంది హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షలకు ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

'కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించుదాం'

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించుదామని ఇఫ్టూరాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే డే వేడుకల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ మోదీ ప్ర భుత్వం మే డే స్ఫూర్తిని దెబ్బతీస్తూ 8 గంటల పని దినం కోసం పోరాడిన అమరుల త్యాగాన్ని అవమానిస్తూ 12 గంటల పని విధానం ప్రవేశ పెట్టాలని చూ స్తోందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాల జీవోలను సవరించడం లేదన్నారు. మే ఒకటో తేదీన వాడవాడలా కార్మిక క్షేత్రంలో ఎర్రజెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి బక్కన్న, రామలక్ష్మణ్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, ఎస్.లక్ష్మి, మున్వర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా ప్రసూతి ఆసుపత్రి, జిల్లా జనరల్ ఆసుపత్రి, నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనాలను మంగళవారం సందర్శించారు. ప్రసూతి ఆసుపత్రిలో ప్రతీ వార్డులో తిరుగుతూ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే వారికి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్లను తనిఖీ చేస్తూ ప్రతీది నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల అదనపు గదుల పనులను పరిశీలించి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలను సందర్శించి జూన్ చివరి వరకు అన్ని బ్లాకులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

గెలుపు కోసం.. అలుపు లేకుండా..

- పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగాల కోసం శ్రమిస్తున్న యువత
- టీఎస్‌పీఎస్సీ పరీక్ష తేదీల ఖరారు
- గురుకుల కొలువులకు ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో వేలాది మంది ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

నిర్మల్‌ఖిల్లా: నిరుద్యోగులు ఏళ్లుగా వేచి చూస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లు ఇప్పటికే విడుదలయ్యాయి. టీఎస్‌పీఎస్సీ నుంచి గ్రూప్స్ నోటిఫికేషన్లు రాగా, తాజాగా గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ కొలువులకు నోటిఫికేషన్లు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనేపథ్యంలో నిరుద్యోగులు సర్కార్ కొలువు కోసం శ్రమిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయంలో, కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కొంతమంది పట్టణంలో గదులు అద్దెకు తీసుకుని ప్రిపేర్ అవుతున్నారు. చాలా కాలంగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో యువత, ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. ఈ క్రమంలో నోటిఫికేషన్లు, పరీక్ష తేదీలు ప్రకటిస్తుండడంతో అభ్యర్థులు అప్రమత్తమయ్యారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంతో అభ్యర్థులు కంగారు పడ్డారు. ఇంతలో పరీక్షల తేదీలు రావడంతో అలర్ట్ అయ్యారు. ఈ క్రమంలో గురుకుల కొలువులకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. నిరుద్యోగులు కొలువుల సాధనకు సంసిద్ధులవుతున్నారు.

జిల్లాలో 20 వేల మంది నిరుద్యోగులు...

నిర్మల్ జిల్లాలో డిగ్రీ, బీఈడీ, పీజీ, బీటెక్ తదితర ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం వేచి చూసే నిరుద్యోగులు దాదాపు 20 వేల మంది వరకు ఉన్నట్లు ఉపాధి కల్పనశాఖ అధికారుల సమాచారం .ఇప్పటికే పోలీసు ఉద్యోగాలకు చెందిన ఎస్సై ప్రధాన పరీక్షలు పూర్తయ్యాయి. ఈనెల 30న కానిస్టేబుల్ పరీక్ష నిర్వహించనున్నారు. రానున్న మే, జూన్, జులై, ఆగస్టు నెలల్లో టీఎస్‌పీఎస్సీ పరీక్షలు జరుగనున్నాయి. గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, లైబ్రేరియన్, జేఎల్, డీఎల్ కొలువులకు వరుస ప్రకటనలు విడుదలై దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

కిటకిటలాడుతున్న గ్రంథాలయాలు..

నిరుద్యోగులతో జిల్లాలోని గ్రంథాలయాలు కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు కావేరి ఫౌండేషన్ నిర్వహించే గ్రంథాలయంలో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూపు – 1, 2, 3, 4 గురుకుల టీచర్లు, జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితర ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. ఈ గ్రంథాలయాల్లో ప్రత్యేకంగా రీడింగ్ రూంలు అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు గ్రంథాలయంలోనే గడుపుతున్నారు. మరికొంత మంది కోచింగ్ కోసం హైదరాబాద్ బాట పట్టారు. అభ్యర్థులు తమకు తగిన ఉద్యోగాలను ఎంపిక చేసుకుని దాని కోసం తగిన ప్రణాళికతో ప్రిపరేషన్‌ను కొనసాగించాలని, సిలబస్ విషయంలో గందరగోళానికి గురికాకుండా పరీక్షస్థాయికి అనుగుణంగా సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

నాలుగేళ్లుగా ప్రిపరేషన్..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో నాలుగేళ్లుగా ప్రిపేర్ అవుతున్నా. హైదరాబాద్‌లో కూడా కోచింగ్ తీసుకున్నా. సబ్జెక్టు మెటీరియల్ పూర్తిగా సేకరించుకుని జిల్లా గ్రంథాలయంలో చదువుతున్నా. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. – ఎల్మల శ్రీనివాస్, నిర్మల్

గ్రంథాలయంలో నోట్స్ తయారీ..



గడిచిన ఆరు నెలలుగా జిల్లా గ్రంథాలయంలో చదువుతున్నా. గ్రంథాలయంలో పుస్తకాలను నా ప్రిపరేషన్‌లో భాగంగా ఉపయోగించుకుంటున్నా. నోట్స్ సొంతంగా తయారు చేసుకుంటున్నా. వసతులు బాగున్నాయి. అభ్యర్థుల కోసం రీడింగ్ రూంలు ఏర్పాటు చేశారు. – రాజశేఖర్, నిర్మల్

ఒకేసారి సన్నద్ధత ఇలా..



అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అటువంటి వారు కామన్ సిలబస్ కలిగిన పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్లాన్ చేసుకోవాలి. సిలబస్‌లోని అంశాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తే పూర్తి అవగాహన వస్తోంది.
– ఎ.గంగాధర్, గ్రూప్స్ విజేత, ఎక్సైజ్ ఎస్సై

ప్రణాళికతో కొలువు సులువే...



పరీక్షల నోటిఫికేషన్ దగ్గర నుంచి పరీక్ష నిర్వహించే తేదీ వరకు ప్రతీ క్షణం ఎంతో విలువైంది. సమయం వృథా చేయకుండా పటిష్టమైన ప్రణాళికతో కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ప్రణాళికతో ముందుకు సాగాలి. కాలాన్ని విభజించుకుని ప్రిపరేషన్ సాగించాలి.
– పీజీ.రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్

సంక్షేమమే బలం.. కార్యకర్తలే బలగం



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ఇవే బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపిస్తాయి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ టౌన్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితోపాటు కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం, బలగమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని దివ్యాగార్డెన్స్‌లో పార్టీ ప్రతినిధుల సమావేశం మంగళవారం నిర్వహించారు. అంతకుముందు మంత్రి నివాసంలో, నాగేశ్వరవాడ, చింతకుంటవాడ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, నాయుడువాడ, బంగాల్‌పేట్, మార్కెట్, బోయవాడలో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌పై దివ్య గార్డెన్స్‌కు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి మౌనం పాటించారు. తర్వాత పార్టీ ప్రాధాన్యత అంశాలపై ముఖ్య నాయకులు చర్చించారు. తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని వివరించారు. బీజేపీ వైఫల్యాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. మహారాష్ట్రలో కూడా సీఎం కేసీఆర్ సభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి పామాయిల్ ఇండస్ట్రీ నిర్మల్ జిల్లాలో రూ.250 కోట్లతో నిర్మించబోతున్నట్లు తెలిపారు. మే నెలలో సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తారని తెలిపారు. రూ.56 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ చేస్తాడని తెలిపారు.

మతతత్వ పార్టీలోకి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పార్టీ మారడం ఖాయం అని తాను మొదటి నుంచి చెబుతున్నానని, చెప్పినట్లే ఆయన మతతత్వ పార్టీ బీజేపీలో చేరాడని ఎద్దేవా చేశారు. బీజేపీ దేశానికి, తెలంగాణకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. సోమవారం నిర్వహించిన బీజేపీ ర్యాలీకి డబ్బులు ఇచ్చి, మద్యం పంచి జన సమీకరణ చేశారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మ న్ చిలుక రమణ, ముడుసు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, అప్పాల వంశీ, పూదరి సాయికృష్ణ, గంధం సుధాకర్, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు ఆదరణ



మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. భైంసాలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్‌ఎస్‌కు ఆదరణ ఉందని, భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దే అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. సమావేశంలో భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్‌చైర్మన్ జేకే.పటేల్, నియోజకవర్గ నాయకులు, మండలాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఇది ట్రైలరే.. ప్రజలు సినిమా చూపిస్తారు

నిర్మల్: బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీ ర్యాలీపై చేసిన వ్యాఖ్యలను ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఖండించారు. అహంకారంతో నిర్మల్ ప్రజలను మంత్రి అవమానిస్తున్నారని మండిపడ్డారు. మందుకు ప్రలోభపడి బీజేపీ ర్యాలీకి ప్రజలు వచ్చారని మంత్రి మాట్లాడడం నిర్మల్ యువతను అవమానించడమే అన్నారు. సోమవారం ర్యాలీ కేవలం ట్రైలర్ మాత్రమేనని, ప్రజలు అసలు సినిమా ముందు చూపిస్తారని హెచ్చరించారు.

పాడి రైతులకు సబ్సిడీ రుణాలు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పాడి రైతులకు ఎంఈజీపీ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకుల మేనేజర్లతో పాడిపశువుల కొనుగోలుకు అందించే రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు పాడి రైతులకు రుణాలు ఇచ్చి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఐటీడీఏ, డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్ లాంటి సంస్థల ద్వారా దళితబంధు పథకంలో మరో 2,800 మంది లబ్ధిదారులు పాడి పశువులు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. మెప్మా, డీఆర్డీఏ ద్వారా ప్రతీ ఏపీఎం వెయ్యి మంది లబ్ధిదారులను గుర్తించి విజయ డెయిరీతో ఒప్పందం చేసుకుని బ్యాంకులకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎస్‌బీఐతో చేసిన ప్రయోగం నేడు రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు ఇచ్చే స్థాయికి చేరిందన్నారు. విజయ డెయిరీ డీడీ మధుసూదన్ మాట్లాడుతూ విజయ డెయిరీకి జిల్లాలో పాల సేకరణ సామర్థ్యం 21 వేల లీటర్లు ఉండగా 3,500 లీటర్లు మాత్రమే పాల సేకరణ జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ అర్హత, ఆసక్తి గల పాడి రైతులకు కాస్త వెసులుబాటుతో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం చంద్రశేఖర్, ఎస్‌బీఐ ఆర్ఎం సూర్యప్రకాశ్‌రావు, జీఎం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని బ్యాంకర్లు, ఎస్సీ కార్పొరేషన్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రమణారెడ్డి, మేనేజర్ సంతోష్ పాల్గొన్నారు.

అక్రమాలన్నీ బయటపెడతాం

- మంత్రి దగ్గర దోపిడీ కౌంటర్లు
- ఈద్గా విషయంలో మైనార్టీలకు మోసం
- డబుల్‌ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: భూకబ్జాలు, అక్రమాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్రంలోనే ముందు ఉన్నారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా బయటపెడతామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. హౌసింగ్ మంత్రిగా ఉన్నప్పుడు తన స్వగ్రామం ఎల్లపెల్లిలో 50 ఇళ్లు మాత్రమే కట్టించారన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసున్నారని విమర్శించారు. న్యాయశాఖ మంత్రిగా కోర్టు భవనం కూడా కట్టించనపుడు పదవి ఎందుకని ప్రశ్నించారు. అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దగ్గర భూదందా, కాంట్రాక్టుల పర్సంటేజీలు, డీవన్ పట్టాలు, క్రషర్ మిషన్లు, ఇసుక మాఫియా ఇలా నాలుగు కౌంటర్లు ఉన్నాయని వివరించారు. అడవిని కాపాడాల్సిన మంత్రి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తన అల్లుడు సైతం హైదరాబాద్ సమీపంలో అటవీ భూమి కబ్జా ఘటనలో ఉన్నాడని ఆరోపించారు. చించోలి(బి) శివారులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం ఇచ్చిన అటవీ భూమిని ఈద్గాకు మళ్లించి ఓట్ల కోసం మైనార్టీలను మోసం చేశాడని ఆరోపించారు. ఇది పూర్తిగా ఎన్నికల ఎత్తుగడని పేర్కొన్నారు. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఒక్కొక్కటిగా మంత్రి అవినీతి చిట్టాను బయటపెడతామని స్పష్టం చేశారు. కేంద్రంతోపాటు రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 15 ఏళ్లు తాను కాంగ్రెస్‌లో ఉన్నానని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాణేనికి బొమ్మ బొరుసులాంటివని పేర్కొన్నారు. బీజేపీలో చేరిన తనకు భారీ స్వాగతం పలికిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నేతలు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, అమరవేణి నర్సాగౌడ్, అలివేలు మంగ, వొడిసెల అర్జున్, రాచకొండ సాగర్, నరేశ్, భాస్కర్, అస్మల శ్రావణ్, కుమ్మరి వెంకటేశ్, గిల్లి విజయ్, నరేశ్‌చౌబే, కమల్‌నయన్, శ్రవణ్, నాందేడపు చిన్ను, అయ్యన్నగారి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఇంటికి 'ఏలేటి'

రాజకీయ కేంద్రంగా పిలిచే నిర్మల్‌లో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఎన్నికలకు ముందే ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నిర్మల్ మున్సిపాలిటీలో హ్యాట్రిక్ కౌన్సిల్, బీఆర్‌ఎస్ నాయకుడు అయ్యన్నగారి రాజేందర్ ఇంటికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి మంగళవారం స్వయంగా వెళ్లారు. గతంలో కాంగ్రెస్‌లో తనతో కలిసి పనిచేశాడని, ఇకముందు కూడా కలిసి వస్తాడని ఆశిస్తున్నానని రాజేందర్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీజేపీ నేతలు అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి పోశెట్టి, నాందేడపు చిన్ను తదితరులు ఉన్నారు. ఈ పరిణామంతో రాజేందర్ త్వరలోనే బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌పై ఇటీవల రాజేందర్ అసమ్మతి లేవనెత్తారు. మంత్రి జోక్యంతో అది సమసిపోయినా లోలోపల పలువురు కౌన్సిలర్లు ఇప్పటికీ అసంతృప్తి ఉన్నట్లు సమాచారం.

మళ్లీ చెడగొట్టు వాన



దిలావర్‌పూర్‌లో...



కుంటాలలో మక్కల బస్తాల నుంచి నీటి తొలగింపు..



భైంసా మార్కెట్‌లో రైతుల పాట్లు



సారంగాపూర్‌లో మక్కలు ఆరబెడుతున్న రైతులు

జిల్లాలో మంగళవారం సాయంత్రం చెడగొట్టు వాన మళ్లీ బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. సారంగపూర్ మండలంలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన మక్కలు, వడ్లు తడిసిపోయాయి. లక్ష్మణచాంద మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికే పంటలు నష్టపోయిన రైతులు మళ్లీ వర్షం పడడంతో ఆందోళన చెందారు. తానూరు మండలం కళ్యాణి, తానూరు, భోసి గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది. నువ్వు పంటలు నేలవాలాయి. కుంటాల మండలంలో కురిసిన అకాల వర్షానికి జనజీవనం స్తంభించింది. నువ్వు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. సారంగపూర్ మండలంలో మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబోసిన పసుపు తడిచింది. నర్సాపూర్(జి) మండల కేంద్రంలో గంటపాటు కురిసిన వర్షానికి డ్రెయినేజీలు పొంగాయి. చెత్త, చెదారం రోడ్లపైకి వచ్చింది. ఓ ప్రైవేటు ల్యాబ్‌పై చెట్టు కొమ్మ విరిగిపడింది. ఎస్‌బీఐ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దిలావర్‌పూర్ మండలంలోనూ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి.

– భైంసాటౌన్/లక్ష్మణచాంద/తానూరు/కుంటాల/సారంగపూర్/నర్సాపూర్(జి)/దిలావర్‌పూర్

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

- భైంసా మున్సిపల్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- పట్టణంలో మంగళవారం మార్నింగ్ వాక్
- తీరు మార్చుకోవాలని హితవు



కిసాన్‌గల్లీలో పట్టణ ప్రకృతివనంపై మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న కలెక్టర్

భైంసాటౌన్: పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి మండిపడ్డారు. డ్రెయినేజీల్లో ఎక్కడికక్కడ చెత్త, పూడిక పేరుకుపోవడంపై మున్సిపల్ కమిషనర్, పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం భైంసా పట్టణంలోని మార్నింగ్ వాక్ నిర్వహించారు. మదీనకాలనీ, కోర్వగల్లి, కిసాన్‌గల్లిల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా మిర్చి మార్కెట్‌యార్డులోని సమీకృతమార్కెట్ పనులు పరిశీలించారు. అనంతరం మదీన కాలనీకి వెళ్లారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ఖాళీస్థలంలో చెత్త వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతుండడంపై మండిపడ్డారు. చెత్త, జంతువుల వ్యర్థాలు డ్రెయిన్లలో వేయకుండా చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేసేవారికి జరిమానా విధించాలని ఆదేశించారు. పశువుల వధ స్లాటర్‌హౌస్‌లో జరిగేలా చూడాలన్నారు. అనంతరం కోర్వగల్లి, కిసాన్ గల్లీలో పర్యటించారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆనుకుని ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం అస్తవ్యస్తంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల మైదానంలో క్రీడాప్రాంగణ పరికరాలు వృథాగా ఉండడమేంటని ప్రశ్నించారు. అనంతరం పార్డి బి బైపాస్‌రోడ్‌లోని డంపింగ్‌యార్డ్‌కు చేరుకున్నారు. డంపింగ్‌యార్డ్‌లో పూర్తి పచ్చదనం కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మినీ స్టేడియం వెనుక వృద్ధాశ్రమం కోసం స్థలం పరిశీలించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. అక్కడి నుంచి గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద పార్కును సందర్శించారు. పార్కులో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేకంగా ఆహ్లాదం కోసం ఏర్పాట్లు చేయాలని, సందర్శకుల కోసం వాచ్‌టవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడి నుంచి భట్టిగల్లి సమీపంలోని ధోబీఘాట్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీల్లో రూ.2.5 కోట్లతో నిర్మిస్తున్న ధోబీఘాట్‌కు అనువైన స్థలం పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. అలాగే రూ.15 కోట్లతో చేపట్టనున్న భైంసా–బాసర బైపాస్‌రోడ్ వంతెన పరిశీలించారు. అక్కడి నుంచి వైకుంఠధామం చేరుకున్నారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వరద ధాటికి నీరు లోనికి రాకుండా ప్రహరీ పటిష్టంగా నిర్మించాలని సూచించారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మానుకు మృతదేహం

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం గెమ్మెన ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు ఆత్రం మానుకు (53) అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆత్రం మానుకు పత్తి పంట వేశాడు. సరైన దిగుబడి రాలేదు. దీంతో రూ.3.50లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. మంగళవారం ఉదయం పంట చేనులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో చనిపోయాడు. మృతుడి భార్య సోముబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


కుమారులతో మమత(ఫైల్)

భైంసాటౌన్: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వాలేగాం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం... మండలం వాలేగాం గ్రామానికి చెందిన మమత(27)కు ముథోల్ మండలం విట్టోలి గ్రామానికి చెందిన గంగాధర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గంగాధర్ బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లగా ఆమె పిల్లలతో కలిసి భైంసాలోని పిప్రికాలనీలో నివసిస్తోంది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

వృద్ధుడి హఠాన్మరణం

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వృద్ధుడు హఠాన్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన బర్కుంట ఎల్లన్న (65) కాలికి గాయంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం చికిత్స కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి కొడుకు రవితో కలిసి రాగా సిబ్బంది గాయానికి కట్టుకట్టారు. అంతలోనే ఆయన మృతి చెందాడు. దీంతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై డాక్టర్ ప్రశాంత్‌ను వివరణ కోరగా గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నాడు.

సెలవుల్లో నేర్చుకుందాం..

- పాఠశాలలకు వేసవి సెలవులు
- పలు అంశాలపై వేసవి శిక్షణ శిబిరాలు
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ..
- శ్రద్ధగా నేర్చుకుంటే పిల్లల్లో ప్రావీణ్యత

ఆదిలాబాద్: పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేసాయి. దీంతో చిన్నారులు ఇన్ని రోజుల నుంచి బడి చదువుల్లో మునిగితేలగా వేసవి సెలవులను ఎంజాయ్ చేయడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. విద్యార్థులు ఈ వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రత్యేకంగా సమ్మర్ శిక్షణ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విలువలను పెంపొందించడానికి ప్రభుత్వ శాఖలు, పలు సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణను ఇవ్వనున్నారు. ఆ వేసవి శిక్షణ శిబిరాలను గురించి ఓసారి పరిశీలిద్దాం....

క్రీడా శిక్షణ ... భవితకు రక్షణ...


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పిల్లలు శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో ఆటలకు తగిన ప్రాధాన్యత ఇస్తారు. అయితే పిల్లల శారీర అభివృద్ధికి తోడ్పాటు అందించే ఆటలు క్రీడల్లో శిక్షణను అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించనుంది. ఈ శిక్షణ కేంద్రాల్లో 14 ఏళ్లలోపు బాల, బాలికలకు పలు క్రీడా అంశాలలో ఉచిత శిక్షణ అందజేయడమే కాకుండా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సైతం అందజేయనున్నారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలు లేకపోలేదు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే 1వ తేదీ నుంచి నెల రోజులపాటు కొనసాగనున్నాయి.


ఈత..

వేసవి సెలవుల్లో చిన్నారులు సెల్ ఫోన్లకు అతుక్కుపోకుండా వేసవిలో చల్లదనంతో పాటు ఆరోగ్యాన్ని అందజేస్తే ఈత శిక్షణను అందజేయడం ఉత్తమం. స్విమ్మింగ్ పిల్లలకు అద్భుతమైన శారీరక వ్యాయామాన్ని అందజేస్తుంది. ఈత కొట్టడం నేర్చుకున్న పిల్లలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుంటారు.

సంస్కరించేలా.. 'బాల సంస్కార్'


రామకృష్ణ మిషన్‌లో చిన్నారులు

భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు శ్రీ రామకృష్ణ మిషన్ చేస్తున్న సేవలు అనిర్వచనీయం. బాలల్లో క్షేత్రస్థాయి నుంచి సంస్కృతి సాంప్రదాయాలు, విలువలను పెంపొందించాలని ఉద్దేశంతో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 'బాల సంస్కార్' అనే శిక్షణ కార్యక్రమానికి అంకురార్పణ చేసింది. ఇందులో నాల్గో తరగతి నుంచి పదో తరగతి బాల బాలికలకు శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మికత వంటి అంశాల్లో సర్వతో ముఖాభివృద్ధి సాధించే విధంగా పలు అంశాల్లో శిక్షణను అందజేయనున్నారు. పిల్లలకు పంచతంత్ర కథలు, నీతి శ్లోకాలు, ఆధ్యాత్మికత పెరుగుదలకు బాలల మహాభారతం, భగవద్గీత శ్లోకాలు, భజనలు, అన్నమయ్య కీర్తనలు, మానసికొల్లాసానికి యోగ, ధ్యానం, విద్యాపరమైన అభివృద్ధి కోసం వేద గణితం, చేతిరాత మెలకువలు, చిత్రలేఖనం వంటి వాటిలో ఈనెల 25వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కాగా మే 14వ తేదీ వరకు 20 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందాలనుకునేవారు సంప్రదించాల్సిన సెల్: 9490052842.



శాస్త్రీయ కళల కేంద్రం.. బాల కేంద్రం

చిన్నారులు మట్టి ముద్దల్లాంటి వారు. వారిని అందమైన, అపురూపమైన వస్తువుల తయారు చేసేవి కళలు. ప్రతి చిన్నారులను సంగీతం, నృత్యం, ఆటలపై అభిరుచి అధికంగా ఉంటుంది. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం, జానపద లలిత సంగీతం, కర్ణాటక సంగీతం, తబలా, హార్మోనియం, పియానో, ఢోలక్, చిత్రలేఖనం వంటి అంశాల్లో ఐదు సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల లోపు విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తున్నారు.







సద్వినియోగం చేసుకోవాలి



పిల్లల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. క్రీడా శిక్షణ శిబిరాలను ఉత్సాహవంతులైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు

సంస్కారవంతంగా వ్యవహరించాలనే



ప్రతి పిల్లవాడు తన శక్తి సామర్థ్యాలు తెలుసుకొని వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని లక్ష్యంతో బాల సంస్కార్ కార్యక్రమాన్ని చేపట్టాం. నేటి ఆధునిక సమాజంలో భారతీయ విలువల పరిరక్షణ అనేది ఎంతో ముఖ్యమైనది. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతుంది.

– లెనిన్, శ్రీ రామకృష్ణ సేవా సమితి, ఆదిలాబాద్

శరీరానికి చక్కని వ్యాయామం...



ఈత కొట్టడంతో అనేక ప్రయోజనా లున్నాయి. ముఖ్యంగా చిన్నారుల పెరుగుదలకు ఈత తోడ్పాటును అందజేస్తుంది. అదే విధంగా శరీరానికి చక్కని వ్యాయామాన్ని సైతం కలుగజేస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక బ్యాచ్ లను నిర్వహిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

– కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు

సులభంగా నేర్చుకునేలా ప్రత్యేక శిక్షణ



శాస్త్రీయ సంగీతం, నృత్యాలను చిన్నారులు సులభంగా నేర్చుకునేలా ప్రత్యేకంగా శిక్షణ అందజేస్తున్నాం. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే శాస్త్రీయ సంగీతం, నృత్యాలు చిన్నారులు నేర్చుకోవాల్సినటువంటి ఆవశ్యకత నేటి సమాజంలో ఎంతైనా ఉంది. మరిన్ని వివరాలకు సెల్: 9703686 368

– మిట్టు రవి బాలకేంద్రం పర్యవేక్షకుడు

ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఎదులాపురం: ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనిల్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయక, వేసిన నోటిఫికేషన్ సక్రమంగా భర్తీ చేయక నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే నిరుద్యోగుల హక్కుల కోసం ప్రశ్నించడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 26న జిల్లా కేంద్రానికి రానున్నారని వెల్లడించారు. ఈ నిరుద్యోగ సమరభేరికి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. నాయకులు భూపెల్లి శ్రీధర్, గుడిపల్లి నగేష్, షకీల్, ఉదయ్ కుమార్ ఉన్నారు.

బాసర ఆలయ ఒడిబియ్యం హుండీ లెక్కింపు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఒడిబియ్యం హుండీని మంగళవారం ఆలయ అధికారుల సమక్షంలో సిబ్బంది లెక్కించారు. ఒడిబియ్యం 36.5 క్వింటాళ్లు, ఎండు కొబ్బరి 165.5 కిలోలు, బరడి పోకలు 15 కిలోలు, పసుపు కొమ్ములు 28.5 కిలోలు, బాదం 09కిలోలు, ఖర్జూర పండ్లు 30.5 కిలోలు వచ్చినట్లు ఆలయ ఈవో విజయ రామారావ్ తెలిపారు.

డైట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


డైట్ అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల 2008–10 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 13 ఏళ్ల అనంతరం వారంతా ఒక చోటకి చేరారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆద్యంతం సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, అధ్యాపకులు వసంత్ దేశపాండే, రాజేశ్వర్ ,కిషన్ రెడ్డి,జలందర్ రెడ్డి,తుషార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌లో తప్పిపోయిన బాలుడు

భైంసాటౌన్: ఆర్టీసీ బస్ ఎక్కి తప్పిపోయిన బాలుడిని తిరిగి కుటుంబీకులకు ఆర్టీసీ అధికారులు అప్పగించారు. పట్టణానికి చెందిన అనురాధ తన కూతురు, అల్లుడిని బస్సు ఎక్కించేందుకు మూడేళ్ల మనుమడితో వచ్చింది. వారిని బస్సు ఎక్కించే క్రమంలో బాలుడు తప్పిపోయి అంద్‌బోరికి వెళ్లే బస్సు ఎక్కాడు. దీంతో తమ బాబు తప్పిపోయాడని డీఎంకు ఫోన్‌లో తెలుపగా వెంటనే స్పందించి స్టేషన్ మేనేజర్, కండక్టర్లకు సమాచారమిచ్చారు. అంద్‌బోరి బస్సులో బాబు ఉన్నట్లు గమనించిన కండక్టర్ డీఎంకు సమాచారమివ్వగా భైంసాలోని డిగ్రీ కళాశాల వద్ద బస్సు నిలిపి బాలుడిని కుటుంబీకులకు అప్పగించారు.

గాయపడిన వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీతాగొందికి చెందిన హన్మండ్లు (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... సీతాగోంది గ్రామానికి చెందిన హన్మండ్లు వృత్తి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజులాగే దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లడానికి జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన హన్మండ్లును రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా బైక్ నడుపుతున్న గోవర్ధన్ సైతం గాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుభీర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి మ్యాకల సర్సప్పకు చెందిన గొర్రెలను కుక్కలు దాడిచేసి చంపేశాయి. పాకకు ఉన్న తలుపుల మధ్య నుంచి చొచ్చుకెళ్లి గొర్రెను, నాలుగు గొర్రె పిల్లలను చంపేశాయి. పలు గొర్రెలు గాయపడ్డాయి. చనిపోయిన వాటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. పశువైద్యాధికారి విశ్వజిత్ పరిశీలించారు.

పిడుగుపాటుకు ఎద్దు..

తలమడుగు: పిడుగుపాటుతో మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డికి చెందిన ఎద్దు మృత్యువాత పడింది. మంగళవారం ఉదయం పొలం వద్దకు మేత పంపించగా ఉరుములతో కూడిన వర్షం కురిచింది.
వర్షానికి చెట్టు కిందకు వెళ్లిన ఎడ్లపై పిడుగు పడడంతో అక్కడికక్కడే ఒక ఎద్దు మృతిచెందింది. మరో ఎద్ద ప్రాణాలతో బయటపడింది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని మండల పశువైద్యాధికారి దుద్‌రామ్ రాథోడ్ పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన ఎడ్మల హనుమంత్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్‌కు తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు చేనులోని సర్వీస్ వైర్‌కు తాకడంతో కరెంటు షాక్ గురై మృత్యువాత పడింది. గేదె విలువ రూ.65వేలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు.

26మందికి జరిమానా


నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 26మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ 26 మంది పట్టుపడగా వారికి రూ.46,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడిషియల్ జడ్జి తీర్పు ఇచ్చారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం


కాలిపోతున్న గడ్డివాము

తానూరు: మండల కేంద్రానికి చెందిన బండారే రాములు పశువుల పాకలోని 25 ఎడ్లబండ్ల గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. మధ్యాహ్న సమయంలో మంటలు వ్యాపించి పశువుల పాకలో నిల్వ ఉంచిన గడ్డివాముకు మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు పంటలను ఆర్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంకటరమణ, ఎస్సై విక్రమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీంతో 80వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

పర్యావరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్

ఎదులాపురం: ఆదివాసీలను అడవికి దూరం చేసేలా ఉన్న నూతన పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఉట్నూర్ ఐటీడీఏకి రెగ్యులర్ పీవోను నియమించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంఘం జిల్లా రెండవ మహాసభలో ఆయన మాట్లాడారు. ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసి గిరిజన విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు ఆత్ర క్రిష్టన్న సంఘం జెండా ఆవిష్కరించారు. సంఘంలో పని చేస్తూ అమరులైన వీరులకు నివాళులర్పించారు.

జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం 25మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉయిక విష్ణు, ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ (రెండవ సారి) ఎన్నికయ్యారు. సంఘం నేతలు ఆత్రం కిష్టన్న, భైరి సోమేష్, ఆత్రం తనుష్, లంకా రాఘవులు, ఆడె అర్జున్, పూసం గణేష్, దుర్వ రాంచందర్, రాజు, సురేష్ ఉన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి


మోహన్(ఫైల్)

ఖానాపూర్: పిడుగుపాటుతో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన పాతకుంట మోహన్(21) ఎప్పటిలాగే మేకలు కాసేందుకు గ్రామంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో వర్షం కురియడంతో మామిడిచెట్ల కిందకి వెళ్లాడు. చెట్టుపై పిడుగుపడడంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు.

షైరింగ్‌లో డిగ్రీ విద్యార్థి ప్రతిభ


సైని సాకేత్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సైని సాకేత్ ఎన్‌సీసీ విద్యార్థి తెలంగాణ బెటాలియన్ ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలో శనివారం నిర్వహించిన ఫైరింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ భీమరావు తెలిపారు. దీంతో రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. సాకేత్‌ను ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జె.భీమరావు, సిబ్బంది అభినందించారు.